ప్రచురణార్థం/ ప్రసారార్థం : తేది : 24 ఏప్రిల్, 2022

# పోలవరాన్ని ప్రశ్నార్థకం చేస్తే ఊరుకునేది లేదు....

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడ్డ సిపిఎం

అంబటి ప్రకటనపై కేంద్రం స్పందించాలి

రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలి

## – సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రశ్నార్థకం చేస్తే ప్రజలు ఊరుకోరని, నిర్వాసితుల్ని ముంచేస్తే సహించబోమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మండిపడ్డారు. ఆదివారం విశాఖకు విచ్చేసిన ఆయన జగదాంబ సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 'రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి అంబటి రాంబాబు తాజాగా చెప్పిన మాటలు అనేక అనుమానాలను లేవనెత్తుతుందని అన్నారు. అసలు ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమని, డిజైన్‌లో లోపాలున్నాయని చెబుతూ డయాగ్రం వాల్ దెబ్బతిందని దాన్ని పునర్నిర్మాణం చేయాలని అంబటి అనడం చూస్తే మొత్తం పోలవరాన్ని ప్రశ్నార్థకం చేస్తే రిజర్వాయర్‌లో మునక ప్రాంతంలోగల ఆదివాసీల భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంలో పడుతుందని శ్రీనివాసరావు ఆందోళన చెందారు. ఆగస్టులో వర్షాలు ప్రారంభం అయి వరదలస్తే నీళ్లు కిందకు పూర్తిగా వెళ్లకుండా ప్రాజెక్టు పూర్తికాకుండా పైన ఊళ్లకు ఊళ్లే మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రాజెక్టును దీన్ని 2 దశలుగా విభజించి 41.15 మీటర్ల దగ్గర మునక ప్రాంతాన్ని కాంటూరును మొదట దశ పూర్తిచేసి వారికి సంబంధించిన పునరావాసాన్ని చేస్తామని కేంద్ర మంత్రి షెకావత్ ప్రకటన చేసిన విషయాన్ని విఎస్సార్ ఉటంకించారు. వాస్తవానికి దానికి రెండు రెట్లు మునక ఉంటుందన్నారు. కేంద్ర మంత్రి చెప్పిన కాంటూరుకు నేడు నీళ్లు పెరిగి వరదతో గ్రామాల మునకు రెండు రెట్లు అదనంగా ఉందన్నారు. పోలవరాన్ని ఇలా ప్రశ్నార్థకం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలు, నిర్వాసితుల భవిష్యత్‌తో ఆటలాడుకుంటున్నాయని విమర్శించారు.

**అంబటి వ్యాఖ్యలపై కేంద్రం ఎందుకు స్పందించదు?**

రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలపై కేంద్రం ఎందుకు స్పందించదని, కేంద్ర జలవనరుల మంత్రి మాట్లాడాలని వి శ్రీనివాసరావు డిమాండ్ అన్నారు. 2020లోనే డయాగ్రమ్ దెబ్బతిన్నట్లు తమ ప్రభుత్వం గుర్తించిందని అప్పటి నుంచి కేంద్రాన్ని నిపుణుల కమిటీని పంపాలని అడుగుతున్నామని ఇంతవరకూ పంపలేదని త్వరలో పంపుతామంటోందని అంబటి తాజాగా చెప్పారని అన్నారు. కేంద్రం ఏం చేస్తోంది? బాధ్యతా రహితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్రం ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం గానీ, కేంద్ర జలవనరుల శాఖ, జలశక్తి మంత్రిత్వశాఖ ఏం చేస్తున్నారని? ఎందుకింత బాధ్యతారహితంగా ఉన్నారని పోలవరం జాతీయ ప్రాజెక్టు అని గుర్తుందా? అంటూ కేంద్రంపై మండిపడ్డారు. కేంద్ర పెద్దలు ఏం చేస్తున్నారు? గుడ్డిగుర్రానికి కేంద్ర పెద్దలు పళ్లు తోముతున్నారా? "నిధులు ఇవ్వరు.. అజమాయిషీ చేయరు? మాటలు మాత్రం చెబుతారు... ఈ రకంగా రాష్ట్ర అభివృద్ధిని దెబ్బతీయడంలో కేంద్రం పనిచేస్తుందని పోలవరం విషయంలో మరోసారి వెల్లడైందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని ఎందుకు రాష్ట్ర ప్రజలకు చెప్పలేదని శ్రీనివాసరావు ప్రశ్నించారు. త్వరలోనే కాల్వలకు నీల్లు వదిలేస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెప్పి ఇప్పుడేమో కేంద్రం నుంచి నిపుణులు రావాలి, చూడాలనడం సమంజసమేనా? రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని, మంత్రి అంబటి ప్రకటనపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**సిపిఎస్ రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి. నిర్బంధాన్ని ఆపాలి..**

సిపిఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, వారి గోడు వినాలని, ఉపాధ్యాయులు నిర్వహించే ఆందోళనలపై నిర్బంధాన్ని ఆపి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎస్‌పై రోడ్డుమ్యాప్ మార్చిలోగా ఇస్తామన్నామని పిఆర్‌సి ఉద్యమం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఇప్పుడు ఏప్రిల్ కూడా అయిపోతుందన్నారు. తమ గోడు చెప్పుకోడానికి వచ్చే ఉపాధ్యాయులను అరెస్టులు చేసి ఇళ్లకు వెళ్లి బెదిరించడం ప్రభుత్వానికి తగదని సిపిఎం హెచ్చరించింది. వారి ఉద్యమంపై నిర్బంధాన్ని ఆపి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె లోకనాథం పాల్గొన్నారు.

= = = =